క్లుప్తంగా

మూడు నెలలు కాదు.. ఒకే నెల పింఛన్

ఆలమూరు: సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న వితంతు (స్పౌజ్) పింఛన్ల పంపిణీ ఎట్టకేలకు శుక్రవారం జరిగింది. జిల్లాలో ఎంపిక చేసిన 2823 మందికి ఈ ఏడాది జూన్ నుంచి పంపిణీ చేయాల్సి ఉన్నా కూటమి ప్రభుత్వం ఆగస్టు నుంచి పంపిణీ చేపట్టింది. దీంతో సంబంధిత లబ్ధిదారులకు ఒక నెలకు రూ.నాలుగు వేలను అందజేశారు. అలాగే ఆలమూరు మండలంలో 134 మందికి రూ.5.36 లక్షలను అందజేశారు. ఏడాది క్రితం మంజూరు చేయాల్సిన ఈ పింఛన్‌ను కనీసం మూడు నెలలకు ఒకేసారి పింఛన్‌ను ఇస్తారనుకుంటే ఒక నెలకు ఇచ్చారంటూ పలుచోట్ల లబ్ధిదారులు ఆవేదన చెందారు.

ఉపాధ్యాయుల సేవలు ప్రశంసనీయం

ఆలమూరు: స్థానిక బొబ్బా జయశ్రీ జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన వెత్సా లక్ష్మణరావు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు చప్పిడి శ్రీవాణి గ్రేస్ శ్యామల సేవలు ప్రశంసనీయం, అభినందనీయని ఉభయగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జ్యోతిబసు అన్నారు. ప్రముఖ కవి గౌరీమల్లిక్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయిని వై.కమల అధ్యక్షతన శుక్రవారం రాత్రి ఉద్యోగ విరమణ సభ జరిగింది. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులను సహచర ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు దుశ్శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ, రాష్ట్ర బీసీ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం, ఉపాధ్యాయ సంఘ నాయకులు అద్దరి శ్రీనివాసరావు, సలాది శ్రీనివాస్, వైవీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన పీవీ సోమసుందరం రూ.10,116 విరాళం శుక్రవారం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

బీబీ సకీనాకు ముస్లింల నివాళి



బీబీ సకీనా షహదత్‌లో భాగంగా గుర్రంపై పీరు ఊరేగింపు

మామిడికుదురు: మహ్మద్ ప్రవక్త మనమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయురాలు బీబీ సకీనాకు ముస్లింలు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. బీబీ సకీనా షహదత్‌ను పురస్కరించుకుని నగరంలోని బీబీ సకీనా పంజా నుంచి పీరును తీసి గుర్రంపై ఊరేగించారు. ఊరేగింపులో భాగంగా నగరం పెద పంజీషా వరకు రక్తం చిందిస్తూ మాతం నిర్వహించారు. నగరం, మామిడికుదురు గ్రామ పురవీధుల్లో పీరును ఊరేగించారు. భక్తులు పీరుకు మొక్కులు తీర్చుకున్నారు. మత ప్రబోధకుడు హాఫీస్ మహ్మద్ రజా మజ్లిస్ ఆలపించారు. గురుహే తాజ్‌దారే వఫా భక్త బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పలు భక్త బృందాలు భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

అయ్యప్పస్వామికి శాంతి హోమం



అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: గ్రామంలో నూతనంగా నిర్మించిన హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం శాంతి హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణం జరిగిన 101 రోజులు అయిన నేపథ్యంలో ఈ హోమం అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మధ్య, ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఉదయం నుంచీ వేద మంత్రాలతో హోమం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, దిరిశాల బాలాజీ తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అష్టలక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజ, మహా హారతి నిర్వహించారు. వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కటికిరెడ్డి మహేశ్, పండుల ఆధ్వర్యంలో సాయంత్రం అయ్యప్ప గీతాలాపన జరిగింది.

మోసం... బాబు నైజం

- కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు
- పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ



పుల్లేటికుర్రులో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు



ఇంటింటికీ వంచన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి, నాయకులు

అంబాజీపేట: చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తారన్న విషయం మరోసారి రుజువైందని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో పుల్లేటికుర్రు సచివాలయాలు 1, 2, కె.పెదపూడి గ్రామాల్లో పరిశీలకుడు సూదాబత్తుల రాము, ఉందుర్తి నాగబాబుల పర్యవేక్షణలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు మొసలి కన్నీరు కార్చి అధికారంలోకి వచ్చిన తరువాత వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. ఎప్పుడు ఎన్నికల్లో పోటీచేసినా ఏదో ఒక పార్టీ మద్దతుతో కల్లబొల్లి కబుర్లు చెప్పడం.. గెలిచిన తరువాత ప్రజల్ని మర్చిపోవడం ఆయన నైజమన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఇంటింటికీ తిరిగి కూటమి నాయకుల ఫొటోలు వేసుకుని బాండ్లు పంపిణీ చేశారని, ఆ బాండ్లలో ఉన్న అంశాలను ఎవరైనా ప్రశ్నిస్తే, ప్రశ్నించిన వారిపై అసత్య ప్రచారాలు చేస్తూ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు, నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, యువకులు ప్రతి వర్గాన్ని కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, రాష్ట్ర నాయకులు మందపాటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారం చేపట్టి, హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబూస్ క్యూఆర్ కోడ్‌తో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, దొమ్మేటి సత్యమోహన్, దంగేటి సూర్యనారాయణ, చిత్రపు సుబ్బారావు, చిట్టూరి రాధాబాయ్, కోట మూర్తి, ఉందుర్తి ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

జనం జగనే నయం అంటున్నారు: మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం: ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి పాలనకు విసుగు చెందిన ప్రజలు జగనే నయం అంటున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ గ్రామ స్థాయి పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తే నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను కూడా పట్టాలెక్కించలేని స్థితిలో ఉన్నారని అన్నారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియక పోవడం విడ్డూరమన్నారు. కూటమి వైఫల్యాలను ఎండగట్టే విధంగా జగన్ చేపట్టిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ సభలు ఆగస్టు నెల 4వ తేదీ నుంచి గ్రామాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఆ రోజు అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేసి ఇచ్చిన షెడ్యూల్ మేరకు రోజుకు నాలుగు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ఆ గ్రామ కార్యకర్తలు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. నియోజకవర్గంలో అన్ని కమిటీలు పూర్తయ్యాయని ఆయా కమిటీలు సైన్యంలా పార్టీ కోసం పనిచేయాలన్నారు. కూటమి సర్కారును కూల్చి జగన్ సీఎం అయ్యే వరకూ నిద్రపోవద్దని గొల్లపల్లి సూచించారు. పార్టీ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్ర మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. మోసకారి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు చేపట్టిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఇంటింటికీ వంచన కరపత్రాలను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్న రాజా, నాయకులు కెఎస్ఎన్ రాజు, కటకంశెట్టి ఆదిత్యకుమార్, తులా సత్యనారాయణ, గుబ్బల రోజారమణి, కూనపరెడ్డి రాంబాబు, కట్టా శ్రీనివాసరావు, గుర్రం జాషువా, మోకా సురేష్, ముప్పర్తి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి కూటమి నేతలా విమర్శించేది!



ఆత్రేయపురంలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపేట: అధికారం చేపట్టిన నాటి నుంచీ అన్నింటా అవినీతే పరమావధిగా పాలన సాగిస్తున్న కూటమి నాయకులకు మచ్చలేని, స్వచ్ఛమైన నాయకుడు, మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఉందా? అని ఆత్రేయపురం మండల వైఎస్సార్ సీపీ నాయకులు ప్రశ్నించారు. ఆత్రేయపురంలో శుక్రవారం సాయంత్రం జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్, ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు, మాజీ సభ్యుడు చెలువూరి రామకృష్ణంరాజు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా కూటమి నాయకులు జగ్గిరెడ్డిని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. అధికార టీడీపీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇసుక, మట్టి మాఫియాలుగా మారి అక్రమంగా తరలిస్తూ, మద్యం బెల్ట్ షాపులు హవా నడిపిస్తూ.. ప్రజలను పీడిస్తూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉచిత ఇసుక విధానం అని చెప్పి నియోజకవర్గంలో లారీకి రూ.7000 చొప్పున వసూలు చేస్తున్న డబ్బు వాడపాలెం చేరుతోంది నిజం కాదా? అంగన్వాడీ పోస్టులతో ప్రారంభించి అన్ని పోస్టులకు డబ్బులు వసూలు చేస్తున్న విషయం వాస్తవం కాదా? ప్రతి మండలంలో కలెక్షన్ ఏజెంట్లను నియమించుకుని అవినీతికి పాల్పడటం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఇన్ని అవినీతి మచ్చలున్న వారు జగ్గిరెడ్డిని విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. సమావేశంలో పార్టీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు పాలా నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పచ్చమట్ల రాజగోపాల్‌రాజు, గొట్టుముక్కల గోపి, ముదునూరి బండ కృష్ణంరాజు, వేగేశ్న గోపాలం, వేముల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పరిశీలించారు. దేవదాయ-ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్య చక్రధరరావుతో కలసి వకుళమాత అన్నదాన భవన నిర్మాణం, కోనేరు నిర్మాణం తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. భక్తుల సౌకర్యం కోసం రహదారులు, పార్కింగ్ ప్రదేశం, మంచినీటి సదుపాయం, మెడికల్ క్యాంపుల ఏర్పాటు, క్యూలైన్ల ఏర్పాట్లు, టాయ్‌లెట్ల ఏర్పాట్లు తదితరాలను పరిశీలించారు. ఈ పనులన్నీ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శనివారం భక్తుల రద్దీ అంశం ప్రస్తావనకు రాగా భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. గోదావరికి వరదల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్డీవో శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ రాజేశ్వరరావు, ఎంపీడీవో కేఎస్ఎస్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం



పలివెల పాఠశాల సదస్సులో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

కొత్తపేట: మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణమే అందరి లక్ష్యం కావాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సై జి.సురేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మండలంలోని పలివెల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శక్తి యాప్, మాదక ద్రవ్యాల నిరోధకం తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం పి.ఇందిరాబాయి అధ్యక్షతన జరిగిన సదస్సులో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచీ విద్యార్థుల ప్రవర్తన, నడవడిక, చదువు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన ఉండాలని సూచించారు. మహిళలపై జరిగే గృహహింస, వరకట్న వేధింపులు, అత్యవసర సమయాల్లో శక్తి యాప్ యొక్క వినియోగం, అత్యవసర సమయాల్లో పోలీస్ సేవలు ఈ విధంగా వినియోగించుకోవాలి, 112 కాల్స్ యొక్క ప్రాధాన్యం, మహిళలపై జరిగే లైంగిక వేధింపులు, పిల్లల మీద జరిగే లైంగిక వేధింపులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే అంశంపై అవగాహన, మహిళలపై జరిగే సైబర్ నేరాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, ట్రాఫిక్, హెల్మెట్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి



హాస్టల్ విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు

మామిడికుదురు: స్థానిక బాలుర హాస్టల్ విద్యార్థులు ఎన్నో సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని వాటిని పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మెండుగుదుటి శిరీష్, ఉమ్మడి జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్ జిల్లెళ్ల రమేష్ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి సంక్షేమ హాస్టల్ బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఉడకని అన్నం పెడుతున్నారని విద్యార్థులు ఆరోపించారు. మరుగుదొడ్లు సరిగ్గా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తాగునీటి సమస్య ఉందని, విద్యార్థులు పడుకునేందుకు సరైన బెడ్ షీట్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారని, హాస్టల్‌కు వెళ్లే రోడ్డు పాడైపోయిందని, హాస్టల్ కేర్ టేకర్ విద్యార్థులను బూతులు తిడుతూ అనుచితంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. వీటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి బళ్ల కీర్తిరైనా, మండల శాఖ అధ్యక్షులు ఉండ్రు వినోద్‌కుమార్, చింతా వర్మ పాల్గొన్నారు.

తల్లిపాల సంస్కృతిపై అవగాహన కల్పించాలి



పినపళ్లలో తల్లి పాల విశిష్టతను తెలియజేస్తున్న వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది

ఆలమూరు: తల్లిపాల సంస్కృతిని గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించి శిశువులకు మెరుగైన ఆరోగ్యాన్ని, వ్యాధి నిరోధకశక్తిని పెంపొందించాలని కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అధికారి గజలక్ష్మి అన్నారు. మండలంలోని పినపళ్లలోని కొత్త కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి తల్లిపాల సంస్కృతిపై అవగాహన కల్పించి ముర్రపాలు విశిష్టతను తెలియజేశారు. ఆరోగ్య పరిస్థితులు దృష్ట్యా తల్లులందరూ పుట్టిన శిశువుకు అరగంట లోపే ముర్రపాలు అందించాలన్నారు. చిన్నారులకు తల్లిపాలు సక్రమంగా అందకపోవడం వల్ల పౌష్టికాహార లేమి ఉత్పన్నమై తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారన్నారు. తల్లిపాలలో ప్రొటీన్లు, రోగ నిరోధక శక్తిని పెంచే విటమిన్లు అధికశాతం ఉంటాయన్నారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, మహిళ సంరక్షణ కార్యదర్శి కేవీస్ నారాయణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కె.కళాంజలి, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవిడిలో..

కొత్తపేట: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు దోహదపడతాయని మండలంలోని అవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీదివ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం సందర్భంగా అవిడి శివాలయం వీధి అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.చంద్రకళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీదివ్య మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టాలని, అప్పటి నుంచి ఆరు నెలల వయసు వచ్చే వరకు విధిగా తల్లి పాలే పట్టించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ ఎస్.ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ గుత్తుల వెంకటరమణ, ఏఎన్ఎం జి.నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త కె.సూర్యరత్నం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి జన్మనక్షత్ర పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని శుక్రవారం స్వామివారికి అష్టోత్తర కలశాభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు పి.రామశేషాచార్యులు, ఎస్‌బీఎం రామకృష్ణమాచార్యులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ట గోదావరి నది నుంచి కలశలతో తెచ్చిన పవిత్ర జలాల కలశతో అర్చకులు వేదమంత్రాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం 108 కలశాలలో ఉంచిన జలాలల్లోకి శ్రీస్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. అలాగే సర్వదేవతలను కలశాల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు నిర్వహించారు. వీటితో పాటు పంచామృతాలతో, వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి విశేష అభిషేకం, పూజలు చేశారు. అలాగే ఆలయంలో విశేష కార్యక్రమాల్లో పాల్గొన్న అధిక సంఖ్యలో భక్తులకు క్యూ లైను, తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదాన పథకంలో భోజన వసతిని అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షించారు.

రెండో శుక్రవారం అమ్మవారి పూజలు

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలోని ఉపాలయంలో కొలువైన రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో మహిళలు సామూహిక వరలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం రెండో శుక్రవారం పర్వదినాన ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ నేతృత్వంలో అర్చకుడు పెద్దింటి వెంకట శ్రీనివాస్ ఈ కుంకుమ పూజలు చేయించారు. దేవస్థానం తరపున ఎటువంటి పూజా రుసుం లేకుండా అమ్మవారి రూపు, పూజా సామగ్రి వారికి సిబ్బంది అందజేశారు. రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారికి పూజల అనంతరం లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం, ప్రసాద వితరణ చేశారు. తదనంతరం నిత్యాన్నదానంలో భోజన వసతి కల్పించారు.

పోటీల్లో విజేతలకు బహుమతులు

కొత్తపేట: ఒకేషనల్ సెలబ్రేషన్స్ ఆర్‌టీఐ యాక్ట్ 2005పై నోడల్ రిసోర్స్ సెంటర్ తణుకు ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. ఆర్‌టీఐ రాష్ట్ర కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు స్థానిక కళాశాలలో వక్తృత్వ పోటీలు, గ్రూప్ డిస్కషన్, వ్యాసరచన, క్విజ్‌లలో పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు నోడల్ రిసోర్స్ సెంటర్ తణుకు కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. బీకాం మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు బేబీ సత్యవాణి, పల్లవి, ఎ.గీత విశాలి (సెకండ్ బీజెడ్సీ) పి.శిరీష, యూ.జయశాంతి, వై. ఫణీశ్వరి (సెకండ్ బీఎస్సీ) పాల్గొన్నారు. వారిలో బేబీ సత్యవాణి వక్తృత్వ పోటీలో ద్వితీయ బహుమతిని గెలుపొందగా, గ్రూప్ డిస్కషన్‌లో బేబీ సత్యవాణి, పల్లవి ద్వితీయ బహుమతిని పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు తెలిపారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

గ్రామాలను టీబీ రహితంగా తీర్చిదిద్దాలి

సఖినేటిపల్లి: గ్రామాలను టీబీ రహితంగా తీర్చిదిద్దాలని సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ దుర్గా కావ్య సూచించారు. శుక్రవారం సఖినేటిపల్లిలంకలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రేపూరి ఏసు నరసింహరాజు అధ్యక్షతన టీబీ ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించారు. వైద్యాధికారి దుర్గా కావ్య మాట్లాడుతూ, టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే విధంగా ఆరోగ్య సిబ్బందితో కలసి కృషి చేయాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ వ్యాధిపైన వారికి పూర్తి అవగాహన ఆమె కల్పించారు. ఉపసర్పంచ్ వెంకట రమణ, నాయకులు జి.రాంజీ, శివప్రసాద్, వీరయ్యనాయుడు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రత పాటించాలి

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ ఇళ్ల చుట్టూ మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌వీబీపీ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్‌వీ రామారావు, సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. ఇసుకపూడి, నందంపూడి గ్రామాల్లో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల ఆవరణలో ఉన్న పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, డ్రైనేజీ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



గూడపల్లిలో వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు

మలికిపురం: గూడపల్లి నూకాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా జరిగాయి. సుమారు 100 మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగింది. నూకాలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అంబాజీపేట పశువుల మార్కెట్, బండారువారి వీధి, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, గంగలకుర్రు పెదగరువు, గంగలకుర్రు అగ్రహారంలలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల వద్ద కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు అన్నదాత సుఖీభవ సాయం

కొత్తపేట: అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఏడీఎస్‌బీ-పీఎం కిసాన్ పథకాల నిధులు శనివారం రైతుల ఖాతాలకు జమ కానున్నట్టు వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు తెలిపారు. ఆ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ పరిధిలోని 23,018 మంది రైతు కుటుంబాలకు రూ.16,11,26,000 ఆర్థిక ప్రయోజనం చేకూరనున్నట్టు తెలిపారు. కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో మొత్తం 23,697 మంది రైతులకు 23,018 మందికి ఈ-కేవైసీ పూర్తికాగా, 6 పేర్లు పెండింగ్‌లో ఉన్నాయని, 673 పేర్లు తిరస్కరించబడ్డాయని పేర్కొన్నారు. నియోజకవర్గానికి సంబంధించి ఆలమూరులో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభిస్తారని ఏడీఏ తెలిపారు.

గోధుమతాచు హల్‌చల్

అంబాజీపేట: నందంపూడిలో వడ్లమాని సుందరరావు ఇంటిలో శుక్రవారం రాత్రి గోధుమ తాచు హల్‌చల్ చేసి భయభ్రాంతులకు గురిచేసింది. దేవుడి గదిలో గోధుమ తాచు కనిపించడంతో సుందరరావు భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు తెలియపరిచారు. దాంతో తాచుపామును వర్మ చాకచక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించి జనసంచారం లేని ప్రదేశంలో వదిలిపెట్టారు.

విద్యార్థులకు బియ్యం పంపిణీ

అంబాజీపేట: పుల్లేటికుర్రుకు చెందిన అమలాపురం లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ బెహరా వీర హనుమంతరావు పుట్టినరోజు పురస్కరించుకుని ముక్కామలలో ఉన్న కంచి కామకోటి శైవాగమ పాఠశాల విద్యార్థులకు బియ్యం, కూరగాయలను శుక్రవారం పంపిణీ చేశారు. వేద పండితులు, పాఠశాల విద్యార్థులు హనుమంతరావు దంపతులను సత్కరించి ఆశీర్వాదం అందించారు. లయన్స్ క్లబ్ సభ్యులు నగదు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ సూదా గణపతి, అనిల్‌కుమార్, రవణం వేణుగోపాలరావు, కూరగాయల శివరామకృష్ణ, సుమన్ వర్మ పాల్గొన్నారు.

ఉపకార వేతనాల అందజేత

అయినవిల్లి: మండలంలోని ఎస్ఎస్‌వీఆర్ కళాశాలలో సింగిల్ పేరెంట్స్ ఉన్న విద్యార్థులకు తదేకం ఫౌండేషన్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ కడలి ఈశ్వరి సంయుక్త ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా శుక్రవారం 12 మంది విద్యార్థులకు రూ.44 వేలు అందజేశారు. మహిళా డిగ్రీ కాలేజీలో చదువుతున్న సింగిల్ పేరెంట్ విద్యార్థులకు ఈ ఫీజు స్కాలర్‌షిప్ అందజేశారు. కార్యక్రమంలో కడలి శివ, మద్దా చంటిబాబు, కాకర బాబ్జి తదితరులు ఉన్నారు.

నకిలీ టీపొడి విక్రయంపై కేసు

రావులపాలెం: స్థానిక ఒక కిరాణా దుకాణంలో నకిలీ టీపొడి విక్రయిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఓకిరాణా షాపులో తమ కంపెనీ పేరుతో నకిలీ టీపొడి విక్రయిస్తున్నారని ఆ కంపెనీ ప్రతినిధి వినోద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపైన, 2027లో వచ్చే పుష్కరాల ఏర్పాట్లు నిర్వహణపైన శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, రెవెన్యూ, ఎండోమెంట్స్ అధికారులతో సమీక్షించారు. ఆలయ ప్రాంగణంలోని కార్యాలయంలో ఈ సమీక్ష ఏర్పాటు చేశారు. ఆలయంలో స్వామివారి కోనేరు నిర్మాణం, నీలకంఠేశ్వర స్వామివారి ఆలయం పునర్నిర్మాణం, ఆలయంకు తూర్పు వైపున ఉన్న భూమిలో కొంత భూమి మెరక చేసే పనులు విషయంపై ఎమ్మెల్యే, అధికారులతో చర్చించారు. ప్రతీ శని, ఆదివారాల్లో రాజోలు నుంచి అంతర్వేదికి ప్రత్యేక బస్సులు ఏర్పాటుకై ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. లైట్‌హౌస్, గుర్రాలక్క గుడి వద్ద గల భూమి టెంపుల్ టూరిజం కింద అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతర్వేదిలో బస్‌స్టాండ్ ఏర్పాటు నిమిత్తం స్థల పరిశీలన చేసి, మార్కింగ్ చేయాలని తహసీల్దార్‌కు, ఎమ్మెల్యే సూచించారు. వీటితో ఇతర అభివృద్ధి పనులు నిమిత్తం ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎస్‌వీ ప్రసాద్, ఇతర శాఖల సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. తొలుత ఆలయంలో లక్ష్మీనరసింహస్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.